
మృణాళినికి సినారె సాహిత్య పురస్కారం అందజేస్తున్న డా. శ్రీధర్

సినారె సాహిత్యంపై లోతైన అధ్యయనం చేయాలి

చిక్కడపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ సి. నారాయణరెడ్డి సాహిత్యంపై లోతైన అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ డా. అయాచితం శ్రీధర్ అన్నారు. ప్రముఖ మహిళా సంస్థ రాగరాగిణి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో డా. సినారె జయంతి సభ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన సినారె సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ రచయిత్రి డా. సి. మృణాళినికి బహూకరించారు. శ్రీధర్ మాట్లాడుతూ.. మాటలు రాతల్లో పదును ఉండే మృణాళిని అపార విజ్ఞాన ఖని అని అన్నారు. అధ్యక్షత వహించిన దక్షిణ మధ్యరైల్వే పూర్వ జీఎం సి. రామకృష్ణ మాట్లాడుతూ.. పరిశోధకుడు తాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ వారసురాలిగా మృణాళిని సాహిత్యం, సంగీతం పరిశోధనలలో ప్రతిభాశాలి అని ప్రశంసించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, సంస్థ అధ్యక్షురాలు రమణకుమారి, ప్రధాన కార్యదర్శి సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రమణకుమారి బృందం సినారె గీతాలు మధురంగా ఆలపించింది.

సింహవాహిని మహాకాళికి పట్టువస్త్రాల సమర్పణ


సింహవాహిని మహాకాళికి పట్టుచీర తీసుకెళ్తున్న కార్పొరేటర్ దంపతులు పావని వినయ్‌కుమార్

చిక్కడపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీ లాల్‌దర్వాజా సింహవాహిని మహాకాళి దేవాలయ 116వ వార్షికోత్సవం సందర్భంగా గాంధీ నగర్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో అమ్మవారికి బంగారు బోనం, చేనేత పట్టుచీర శుక్రవారం సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజేందర్ యాదవ్, సభ్యులు మారుతి యాదవ్, అరవింద్‌గౌడ్, వెంకటేష్ కార్పొరేటర్ దంపతులను సన్మానించారు. ముఖ్యఅతిథిగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, నల్లకుంట, హిమాయత్‌నగర్, అంబర్‌పేట, కవాడిగూడ, మోండామార్కెట్, రాంగోపాల్‌పేట, మన్సూరాబాద్ కార్పొరేటర్లు వై. అమృత, మహాలక్ష్మి, పద్మావెంకట్‌రెడ్డి, రచనశ్రీ, కొంతం దీపిక, సుచరిత, కొప్పు నరసింహారెడ్డి, బీజేపీ అధికారప్రతినిధి బండారు విజయలక్ష్మి, బీజేపీ సికింద్రాబాద్ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట మహాకాళికి..

రాంనగర్: అంబర్‌పేట పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మహాకాళి అమ్మవారికి శుక్రవారం పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వర్కాల కృష్ణ, చెలక శివకుమార్, కోశాధికారి భీమనపల్లి అశోక్, సంఘం నేతలు పాల్గొన్నారు.

గంగపుత్ర కాలనీలో రూ. 9 లక్షలతో డ్రైనేజీ పైప్‌లైన్

ముషీరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గంగపుత్ర కాలనీలో రూ. 9 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను శుక్రవారం చేపట్టారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో 30 ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ప్రజా ప్రతినిధులు, అధికారులకు విజ్ఞప్తి చేయడంతో ఎట్టకేలకు పైప్‌లైన్ పనులను ప్రారంభించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

బర్కత్‌పుర, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి కోరారు. శుక్రవారం ఇందిరానగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో అసంఘటిత రంగ కార్మికులకు ఈ-శ్రమ్ కార్డుల నమోదు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో మహేశ్వరి, శోభారాణి, సబిత, రమాదేవి, వరలక్ష్మి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

జనరంజకంగా పౌరాణిక పద్యనాటకాల ప్రదర్శన


నాటక ప్రదర్శనలో ఓ సన్నివేశం

చిక్కడపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పాలమూరి కళా విపంచి ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీ సౌజన్యంతో త్యాగరాయగానసభలో శుక్రవారం పౌరాణిక పద్య నాటకాల ప్రదర్శన జనరంజకంగా సాగింది. అనుభవజ్ఞులైన కళాకారులు, నటులు వెంకటయ్య, దయాకర్, విజయరాణి, రాధిక ప్రదర్శనల్లో పాల్గొన్నారు. నటుడు గోపాలకృష్ణ, కళాపోషకులు రామచంద్రరావు, హనుమంతరావు, సదానందం నటీనటులను అభినందించారు.

కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి


మాట్లాడుతున్న వెంకటరమణ

రాంనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కల్లు గీత కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో జరిగిన కల్లు గీత సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గీత కార్మికులకు ఉచితంగా సేఫ్టీ మోకులు ఇవ్వాలని, ప్రమాదానికి గురై చనిపోయిన వారి కుటుంబాలకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బెల్ట్ షాపులను పూర్తిగా నిషేధించి కల్లులోని పోషకాలు, ఔషధగుణాలను ప్రభుత్వమే ప్రచారం చేసి మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు. 50 ఏళ్ల పైబడిన గీత కార్మికులకు చేయూత పథకం ద్వారా ప్రతినెలా పింఛన్ ఇవ్వాలన్నారు. తాటి, ఈత చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని, సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం ఉపాధ్యక్షులు బి. వెంకటనర్సయ్య, గౌరి వెంకన్న, అచ్చాలు, వెంకటమల్లయ్య, జయరాములు, గోవింద్, అంజయ్య, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారు మైసమ్మ కల్యాణం

ముషీరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ మహాత్మానగర్‌లో బంగారు మైసమ్మ దేవాలయంలో అమ్మవారి కల్యాణం మహోత్సవాన్ని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కో-ఆర్డినేటర్ బిజ్జి కనకేష్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కల్యాణానికి ముందు బోనాలతో ఆలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 20 సంవత్సరాల నుంచి అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సదానంద్ ముదిరాజ్, బీసీ కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కాటం నర్సింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ అభివృద్ధిలో జర్నలిస్టుల కృషి ఎనలేనిది

- ఏసీఏ మాజీ సీఏసీ చైర్మన్ సత్యప్రసాద్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): దేశంలో క్రికెట్‌కు ఈస్థాయిలో ఆదరణ లభించడానికి, క్రికెట్ ఇంతలా అభివృద్ధి కావడానికి జర్నలిస్టులు చేసిన కృషి ఎనలేనిదని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ మాజీ సీఏసీ చైర్మన్ సత్యప్రసాద్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం విజయానంద్ మైదానంలో జరిగిన కేఎస్‌సీ జర్నలిస్టు ప్రీమియర్ లీగ్ సెమీఫైనల్స్ ప్రారంభానికి సత్యప్రసాద్, లైఫ్‌స్పాన్ స్పోర్ట్స్ హెడ్ భరణి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒక నైపుణ్యం గల ప్లేయర్‌ను పైకి తీసుకురావడంలో జర్నలిస్టులు పడే తాపత్రయం, శ్రద్ధను ప్రశంసించారు. తొలి సెమీఫైనల్లో ఎన్టీవీ రైజర్స్ జట్టుపై ఏబీఎన్-ఆంధ్రజ్యోతి టీమ్ 48 పరుగుల తేడాతో పోరాడి ఓడింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎన్టీవీ 20 ఓవర్లలో 155/7 స్కోరు చేసింది. ఛేదనలో ఆంధ్రజ్యోతి 20 ఓవర్లలో 107/9 మాత్రమే స్కోరు చేసి ఓటమి పాలైంది.

ఘనంగా బోనాల వేడుక


ఘటం ఊరేగింపులో ఆలయ చైర్మన్ నాగులు యాదవ్ తదితరులు

రాంనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ్‌నగర్‌లో బంగారు మైసమ్మ ఆలయంలో శుక్రవారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు బి. గంగాధర్, రవి ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రేటర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం. అరవింద్‌కుమార్‌యాదవ్, శ్రీరామ్‌నగర్ బస్తీ అధ్యక్ష, కార్యదర్శులు హరినాథ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అడిక్‌మెట్ డివిజన్‌లో..

అడిక్‌మెట్ డివిజన్‌లోని రాంనగర్ నల్లపోచమ్మ, ముత్యాలమ్మ, నాగమ్మ ఆలయంలో శుక్రవారం బోనాల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఘటం ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగులు యాదవ్, సభ్యులు వెంకట్రామ్‌రెడ్డి, ఆకారం శ్రీనివాస్, శ్రీధర్, బైండ్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలకు ప్రతీక కార్గిల్ విజయ్ దివస్



రెడ్డి కళాశాల వద్ద విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


ట్యాంక్‌బండ్‌పై కార్గిల్ విజయ్ దివస్‌లో ఏఐవైఎఫ్ నాయకులు

బర్కత్‌పుర, జూలై 26 (ఆంధ్రజ్యోతి): భారత సైనికుల త్యాగాలకు ప్రతీక కార్గిల్ విజయ్ దివస్ అని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్ గౌతమ్‌రావు అన్నారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం బర్కత్‌పురలోని ఆర్‌బీవీఆర్ రెడ్డి కళాశాల వద్ద కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించి వీర మరణం పొందిన సైనికులకు నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గౌతమ్‌రావు మాట్లాడుతూ.. దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన సైనికులు, వారి కుటుంబాలకు దేశ ప్రజలు ఎల్లప్పుడు రుణపడి ఉంటారని అన్నారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం కన్వీనర్ టి రాజశేఖర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పణ్ డైరెక్టర్ ప్రేమ్‌చంద్ జైన్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలింద్రి శ్రీనివాస్‌యాదవ్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆర్ సీతారాం, బీజేపీ అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్ ఎం. శ్యామ్‌రాజ్, తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ ఓల్డ్ సిటీ అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలను స్మరించుకోవాలి

కవాడిగూడ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కార్గిల్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన సైనికుల త్యాగాలను స్మరించుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వలీవుల్లా ఖాద్రి, కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర పిలుపునిచ్చారు. శుక్రవారం ట్యాంక్‌బండ్‌పై గల యుద్ధ ట్యాంక్ వద్ద కార్గిల్ అమర సైనికులకు నివాళులర్పించారు. సైనిక ఉద్యోగం దేశభక్తితో కూడుకుందని, 'అగ్నిపథ్' దీనికి పూర్తిగా విరుద్ధంగా ఉందన్నారు. అగ్నిపథ్‌ను రద్దు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నేతలు శ్రీకాంత్, సత్యప్రసాద్, శ్రీమాన్, ఆర్ బాలకృష్ణ, షేక్ మహమూద్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో మహిళా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి తదితరులు

కవాడిగూడ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో మహిళా సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి ఆరోపించారు. శుక్రవారం బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన, ఆందోళన కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహిళా మోర్చా కార్యకర్తలు అసెంబ్లీ వైపునకు దూసుకెళ్లడానికి యత్నించగా అనుమతి లేదని పోలీసులు అడ్డుకున్నారు. మహిళా మోర్చా కార్యకర్తలు, పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మహిళా మోర్చా కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. ఈ సందర్భంగా శిల్పారెడ్డి మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు రూ. 2,500, పింఛన్ రూ. 4 వేలు, బాలికలకు స్కూటీ, కల్యాణ లక్ష్మి పథకం కింద తులం బంగారం ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బడ్జెట్‌లో వాటి విషయం మరిచిపోయారని ధ్వజమెత్తారు. మహిళా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళా మోర్చా నాయకురాళ్లు పాల్గొన్నారు.

'ప్రతిపక్షాల ఆరోపణలు అర్థరహితం'

రాంనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌పై ప్రతిపక్షాల ఆరోపణలు అర్థరహితమని టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ అభిషేక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి రూ. 10 వేల కోట్లు కేటాయించడం గతంలో ఎప్పుడూ జరగలేదన్నారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారని, జీహెచ్ఎంసీ, జలమండలి, మెట్రోకు తగిన బడ్జెట్ కేటాయించారని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు బడ్జెట్‌పై విమర్శలు మాని ప్రభుత్వానికి సహకరించాలని ఆయన సూచించారు.

నగరానికి చాలీచాలని నిధుల కేటాయింపు

బర్కత్‌పుర: రాష్ట్ర బడ్జెట్ డబుల్ గాడిద గుడ్డు లాంటిదని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు ఎద్దేవా చేశారు. శుక్రవారం బర్కత్‌పురాలో బీజేపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో నగరానికి చాలీచాలని నిధులు కేటాయించారని ధ్వజమెత్తారు. నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఊసే బడ్జెట్‌లో లేదన్నారు. ఉచిత తాగునీటి సరఫరా పథకానికి నిధులు కేటాయించలేదని ఆరోపించారు. మూసీ సుందరీకరణకు రూ. 5 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

బీసీలకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్రాల బడ్జెట్‌లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లు బీసీలకు వ్యతిరేకంగా ఉన్నాయని నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ వీజీఆర్ నారగోని ఆరోపించారు. శుక్రవారం బర్కత్‌పురాలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

హామీలకు వ్యతిరేకంగా..

కవాడిగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలకు అనుగుణంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. శుక్రవారం దోమలగూడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

బీసీలకు అన్యాయం

రాంనగర్: రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు నిధుల కేటాయింపులో తీరని అన్యాయం జరిగిందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి టి. గౌరీశంకర్ విమర్శించారు. 50 శాతం ఉన్న బీసీలకు జనాభా ప్రాతిపదికన బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు.

మత్స్య పరిశ్రమ అభివృద్ధికి..

బడ్జెట్‌లో మత్స్య పరిశ్రమ అభివృద్ధికి అన్యాయం చేశారని మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహ, లెల్లెల బాలకృష్ణ ఆరోపించారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మత్స్యకారుల జీవిత భద్రత, ఉపాధికి ఎలాంటి నిధులు కేటాయించలేదన్నారు.


కళాకారులతో నాదెండ్ల భాస్కరరావు తదితరులు

నగరంతో 70 ఏళ్ల అనుబంధం

- మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు

చిక్కడపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌తో తనకు 70 ఏళ్ల అనుబంధం ఉందని మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు అన్నారు. మోహన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో తెలుగు కళామాలిక పేరిట ఆంధ్ర, తెలంగాణ అపూర్వ కళాప్రదర్శనలు జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన కళాకారులను సన్మానించి పురస్కారాలు బహూకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బ్రాహ్మణులు సమాజానికి జ్ఞానసంపద ఇచ్చారనీ, కానీ, కొందరి వల్ల నేడు వారు వివక్షకు గురవుతున్నారని అన్నారు. ప్రాంతాలు వేరయినా పదికోట్ల తెలుగు వారందరూ ఐక్యంగా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. డా. వేణుగోపాలచారి, వీడీ రాజగోపాల్, దైవజ్ఞ శర్మ, ముదిగొండ శివప్రసాద్, మోహన్‌గాంధీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతు

గోల్నాక, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నింబోలిఅడ్డ ఎస్సీ హాస్టల్ లేన్‌లో రోడ్డు గుంతలమయంగా ఉందని, మరమ్మతులు చేయించాలని స్థానికులు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన తన సొంత నిధులు రూ. 50 వేలు ఖర్చుచేసి శుక్రవారం మరమ్మతులు చేయించారు. బీఆర్ఎస్ నాయకులు టి. పల్లవి, ఎం. సత్యనారాయణ, పి. సంతోష్‌కుమార్ తదితరులు పనులను పర్యవేక్షించారు.

'ఉద్యమ కళాకారులకు పదోన్నతి కల్పించాలి'

రాంనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రముఖ పాత్ర పోషించిన ఉద్యమ కళాకారులకు ప్రభుత్వం పదోన్నతి కల్పించాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. శుక్రవారం టీడీపీ నగర కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

రాష్ట్రంలో సుమారు 10 వేలమంది కళాకారులు ఉన్నారని, వారిని ఆదుకోవాలని కోరారు. సమావేశంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి. బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న ప్రొఫెసర్ విజయలక్ష్మి

రాంనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): న్యాయ విద్యార్థులు మూట్ కోర్టులో నైపుణ్యం పెంపొందించుకోవాలని ఓయూ లా విభాగం డీన్ ప్రొఫెసర్ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ లా కళాశాలలో న్యాయ విద్యార్థులకు నిర్వహించిన మూట్ కోర్టు పోటీలను ఆమె ప్రారంభించారు. న్యాయ విద్యార్థులు థియరీతోపాటు క్షేత్రస్థాయిలో ఎలా ఉండాలి, ఏ విధంగా నైపుణ్యం పెంపొందించుకోవాలో మూట్ కోర్టు పోటీల్లో తెలుసుకోవచ్చన్నారు. నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కేశవరావు న్యాయ వ్యవస్థకు సంబంధించిన అంశాలపై వివరించారు. ప్రొఫెసర్ రాంప్రసాద్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ న్యాయ కళాశాల విద్యార్థులకు మూట్ కోర్టు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులను 16 గ్రూపులుగా విభజించి మూట్ కోర్టు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ విద్యా సంస్థల డైరెక్టర్ రిషికాంత్, లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన, న్యాయ అధ్యాపకులు పాల్గొన్నారు.

బోనాల వేడుకల్లో డీజేలకు అనుమతి లేదు : ఏసీపీ


మాట్లాడుతున్న ఏసీపీ రమేశ్‌కుమార్

చిక్కడపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బోనాల వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని ఏసీపీ ఎల్. రమేశ్‌కుమార్ తెలిపారు. ఈనెల 28, 29 తేదీల్లో జరిగే బోనాల ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బోనాలతో ఆలయానికి వచ్చే మహిళలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయాల కమిటీ సభ్యులకు సూచించారు.

అంబర్‌పేటలో బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన


మహాకాళి ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ బాలస్వామి

అంబర్‌పేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆదివారం జరిగే బోనాల బందోబస్తు ఏర్పాట్లను ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి శుక్రవారం పరిశీలించారు. అంబర్‌పేటలో ప్రసిద్ధి చెందిన మహాకాళి అమ్మవారికి బోనాలు సమర్పించడానికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా చేస్తున్న ఏర్పాట్లను దేవస్థాన సేవా సమితి ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంబర్‌పేట పీఎస్ పరిధిలోగల అమ్మవారి దేవాలయాల వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాచిగూడ ఏసీపీ రఘు, ట్రాఫిక్ ఏసీపీ సంపత్, అంబర్‌పేట సీఐ అశోక్, ట్రాఫిక్ సీఐ లెనిన్, అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఆలయాల వద్ద రోడ్లకు మరమ్మతులు చేయాలి'

బోనాల పండుగ సందర్భంగా ఆలయాల వద్ద గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేయాలని బీజేవైఎం సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి యశంత్ జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. బోనాలతో ఆలయాలకు వచ్చే మహిళలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని, ఆలయాల వద్ద పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు.

'స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి'

చిక్కడపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ గవర్నర్ రాధాకృష్ణన్‌కు లేఖ రాశారు. స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు రాజ్యాంగ సమానత్వ స్ఫూర్తికి భంగం కలిగించేలా ఉన్నాయన్నారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి, డీజీపీకి ఆదేశాలు ఇవ్వాలని లేఖలో గవర్నర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు.

బస్తీల్లో గొడవ చేస్తున్న ముగ్గురు యువకులకు జైలు

కవాడిగూడ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో గొడవ చేసిన ముగ్గురు యువకులకు న్యాయస్థానం ఏడు రోజుల జైలుశిక్ష, జరిమానా విధించింది. గాంధీనగర్ సీఐ డి. రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బన్సీలాల్‌పేటలో నివసిస్తున్న సి. రాజ్‌కుమార్(19), ఎం. ఈశ్వర్(21), రాంగోపాల్‌పేట్ నల్లగుట్టలో ఉంటున్న ఎ. బన్నీ(20) స్నేహితులు. ముగ్గురూ మద్యం తాగి బస్తీల్లో గొడవ చేస్తున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు వారిపై కేసు నమోదు చేసి శుక్రవారం మారేడ్‌పల్లిలోని 13వ స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎ. శారదాదేవి ఎదుట హాజరుపర్చారు. కేసును విచారించిన మేజిస్ట్రేట్ ముగ్గురు యువకులకు ఏడు రోజుల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ. 50 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని సీఐ తెలిపారు.

గుండెపోటుతో ఆస్పత్రి వాచ్‌మన్ మృతి


విశ్వనాథ్ (ఫైల్)

ముషీరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఆస్పత్రి వాచ్‌మన్ మృతి చెందాడు. కవాడిగూడకు చెందిన విశ్వనాథ్(58) ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో 13 సంవత్సరాలుగా వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం విధులకు హాజరైన అతడు గుండెపోటు రావడంతో ఆస్పత్రిలోనే కుప్పకూలాడు. గమనించిన వైద్య సిబ్బంది సీపీఆర్ చేసి గాంధీ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందాడని నిర్ధారించారు. విశ్వనాథ్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కారు తీయమన్నాడని వ్యక్తిపై కాంగ్రెస్ నాయకుడి దాడి

అంబర్‌పేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పార్క్ చేసిన కారు తీయమన్నందుకు ఓ వ్యక్తిపై కాంగ్రెస్ నాయకుడు దాడిచేశాడు. అంబర్‌పేట సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నాక శంకర్‌నగర్‌లో నివసిస్తున్న శ్రీనివాస్ నాయక్ తన కారును ప్రతిరోజూ ఇంటి ఎదుట పార్క్ చేస్తుంటాడు. గురువారం రాత్రి బయటకు వెళ్లి వచ్చేసరికి ఆ స్థలంలో కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ యాదవ్ కారు పార్క్ చేసి ఉంది. కారు తీయమని శ్రీనివాస్ నాయక్ ఆయనకు చెప్పగా.. కోపోద్రిక్తుడైన కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ నాయక్‌పై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు శ్రీనివాస్ యాదవ్‌పై కేసు నమోదు చేశారు.

అంధ బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తిని శిక్షించాలి

అంబర్‌పేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అంధ బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఈబీసీ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బాలికకు మెరుగైన వైద్యం అందించాలని, కుటుంబానికి రూ. 15 లక్షల నష్టపరిహారం చెల్లించాలన్నారు. వసతి గృహాలలో తాత్కాలిక ఇన్‌చార్జి వార్డెన్‌లను తొలగించి పర్మినెంట్ వార్డెన్‌లను నియమించాలన్నారు. సమావేశంలో నాయకులు సతీష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్రాముల గంజాయి స్వాధీనం

- పాత నేరస్థుడి అరెస్ట్


స్వాధీనం చేసుకున్న గంజాయి

రాంనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న పాత నేరస్థుడిని నల్లకుంట పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి ఆరు గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సీఐ బి. జగదీశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్ రైల్వే స్టేషన్ వద్ద నివసిస్తున్న షేక్ మోసిన్(28) ఏసీ మెకానిక్. ఓ కేసులో జైలుకెళ్లి ఇటీవల విడుదలయ్యాడు. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో అడిక్‌మెట్ ప్లేగ్రౌండ్‌లో గంజాయి విక్రయిస్తున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ శ్రీనివాస్‌రావు సిబ్బందితో అక్కడికి చేరుకొని అతడిని అదుపులోకి తీసుకుని ఆరు గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.